కథ

# రెండోభార్య

-సాహితి

"వెంకట్రావుగారి భార్య వచ్చింది సార్! మిమ్మల్ని కలవాలట" అటెండరు చెప్పిన మాటలకి సూపర్నెంటు భృకుటి ముడిపడింది.

"పొద్దుటే గదయ్యా, వచ్చి బెనిఫిట్సవీ తీసుకున్నది?" అడిగాడు.

"ఆవిడ ఫస్ట్‌వైఫ్ ఈవిడ సెకండు." అదోలాంటి భావాన్ని వ్యక్తపరుస్తూ చెప్పాడు అటెండరు.

"సరే రమ్మను." అన్నాడు సూపర్నెంటు. ఆయన ఆ ఆఫీసుకి కొత్తగా ట్రాన్స్ఫరై వచ్చాడు. రెణ్ణెల్లక్రితం పెరాలిసిసొచ్చి యిన్‌వేలిడ్ రిటైర్మెంటు తీసుకున్న వెంకట్రావుగురించిగానీ అతనికిద్దరు భార్యలన్న సంగతి గానీ తెలీదు. అతను ఛార్జితీసుకున్న రికార్డుల్లో ఈ వెంకట్రావు కూడా ఒక రికార్డు. అంతే!

సూపర్నెంటు దగ్గిర్నుంచీ గ్రీన్‌సిగ్నల్ రాగానే అటెండరు వెళ్ళి వెంకట్రావు రెండోభార్యని లోపలికి పంపించాడు.

అమెని పరకాయించి చూసాడు సూపర్నెంటు. మనిషి చామనఛాయలో దృఢంగానే వుందిగానీ దీనంగా వుంది. ముప్పయ్యైదు వుంటుంది వయసు. చేతిలో మూడేళ్ళ పిల్ల, అమె కూతురుకాబోలు. చదువుకున్న దాన్లాగే కనిపించిందామె సూపర్నెంటుకి.

"కూర్చోమ్మా!" అన్నాడు ఎదురుగా వున్న కుర్చీని సూచిస్తూ.

"నమస్తే, నాపేరు విద్యావతి. వెంకట్రావుగారు మావారు," తను కూర్చుని, పాపని వళ్ళో కూర్చోబెట్టుకుంది. పొరుగూరి నుంచీ వచ్చినట్టుంది. చేతిలో సంచీ వుంది. దాన్ని కుర్చీకానించి నిలబెట్టింది.

"తెలిసింది" క్లుప్తంగా అన్నాడు సూపర్నెంటు.

"వారికి పెరాలిసిసొచ్చింది."

"ఔను."

ఆయన మాటల్లో ఏ విధమైన ఎంకరేజిమెంటూ కనిపించక పోయేసరికి తనొచ్చిన విషయాన్ని ఏవిధంగా ప్రస్తావించాలో అర్థంకాక తికమకపడింది.

"చెప్పండి," అన్నాడాయన.

"వారి బెనిఫిట్సవీ..."

"మొర్నింగే పేమెంటైపోయాయి."

"ఆఁ!! ఎవరొచ్చి తీసుకున్నారు?"

"లలితగారు. వెంకట్రావుగారి భార్య."

"ఆవిడేకాదు. నేనూ ఆయన భార్యనే. అన్నిట్లోనూ నా పేరు కూడా రాస్తానన్నారు" హతాశురాలైపోయిందామె.

ఆమె అమాయకత్వానికీ అజ్ఞానానికీ నవ్వాలో జాలిపడాలో అర్థంకాలేదు సూపర్నెంటుకి. "అలా ఎలా రాస్తాడమ్మా? గవర్నమెంటు వుద్యోగి రెండు పెళ్ళిళ్ళు చేసుకోకూడదు. అలా చేసుకున్నట్టు తెలిస్తే వుద్యోగం వూడుతుంది. జైలుకి కూడా వెళ్ళాలి" అన్నాడు.

"అలాక్కాదండీ! మొదటిభార్య కంప్లెయింటిస్తేనే గొడవలొస్తాయి. మా అక్కగారు మంచిదిగాబట్టి అలాంటి పేచీలేం రావనీ అన్నిచోట్లా ఆవిడ పేరు వెంబడే నా పేరుకూడా రాసాననీ చెప్పారు వారు."

మనుష్యులు అంతలేసి అబద్ధాలు ఎలా ఆడతారో అర్థంకాలేదు సూపర్నెంటుకి. విద్యావతికి ఏం జవాబివ్వాలో తెలీలేదు.

"నిజంగానే నాకేమీ రాదాండీ?" ఆయన మొహంలోకి చూస్తూ దీనంగా అడిగింది.

"అంతేనమ్మా!"

దిక్కుతోచనట్టు అలాగే కూర్చుండిపోయింది. ఏదో ఒకదారి దొరుకుతుందని ఎంతో ఆశతో వచ్చింది. అత్యాశైంది. కళ్ళలోంచీ నీళ్ళు రాలేదుగానీ గుండెల్లో సుడిగుండాలు సుళ్ళుతిరిగాయి. ఆమెని చూస్తుంటే సూపర్నెంటుకి జాలేసింది.

"వెంకట్రావుగారు అంత నిలువునా ద్రోహంచేసే మనిషి కాదనుకుంటానమ్మా! ఎడ్రెసిస్తాను వెళ్ళి కలవండి." అన్నాడు తనకి చాతనైన సాయంచెయ్యాలనే వుద్దేశంతో. ఎడ్రసు పేపరుమీద రాసి యిచ్చాడు.

ఆమె రెండు చేతులూ జోడించి నమస్కరించి అది తీసుకుని వెళ్ళబోయింది.

"ఒక్కమాట. అధైర్యపడకమ్మా! నీకు కూడా వెంకట్రావుగారు ఏమీ చెయ్యకపోయినా పిల్లని కాదనడానికి వీల్లేదు. కోర్టుకెళ్తే పిల్లకేనా ఏదో ఒకదారి చూపిస్తారు." అన్నాడు ధైర్యం చెప్తున్నట్టు.

ఆమె నిర్వేదంగా నవ్వింది. "ఇప్పటికి పబ్బంగడిస్తే కోర్టు కెళ్ళడం మాట ఆలోచించుకోవచ్చు." అంది.

తర్వాత సంచీనీ పిల్లనీ తీసుకుని వెళ్ళిపోయింది.

* * *

ఇల్లు కనుక్కోవడం పెద్ద సమస్య కాలేదు విద్యావతికి. వెంకట్రావు యింట్లోనే వున్నాడు. ముందుగదిలో ఒకవారగా వేసిన మంచంమీద పడుక్కుని పైకప్పుకేసి చూస్తున్నాడు. గడ్డం పెరిగింది. చెంపలు లోతుకిపోయాయి.

అతనికి పక్షవాతం రావడం, తమని అన్యాయం చెయ్యడం ఆ క్షణాన గుర్తురాలేదామెకి. అతన్నలా చూడటంతో కళ్ళలో నీళ్ళునిలిచాయి. మంచానపడ్డాక చూడ్డం యిదే మొదటి సారి. హాస్పిటల్లో చేర్చినప్పుడు మనసాపుకోలేక వెళ్ళినా ఆమెని దగ్గరకి రానివ్వలేదు వెంకట్రావు మొదటిభార్య, ఆమె వైపువాళ్ళు.

"ఎలావుంది వొంట్లో?" గుమ్మంలోకి సంకోచంగా అడుగుపెడ్తూ అడిగింది.

అతను కొంత వ్యవధి తీసుకుని తలతిప్పడమూ - "ఎవరదీ?" అంటూ లోపలిగదుల్లోంచి అతనిమొదటి భార్య లలిత రావడమూ ఒకేసారి జరిగింది.

ఇద్దరికళ్ళల్లోనూ ఒకటే ప్రశ్న - "నువ్వా?!"

ముందుగా తేరుకుని లలిత గట్టిగా అంది "ఇక్కడికి కూడా తయారయ్యావా? ఆయన అనారోగ్యంతో నీ పీడ విరగడైందనుకుంటే ఏకంగా యింటికే వచ్చేసావా?"

"మీరుంటారా కాస్త?" విద్యావతి లలితతో అని, భర్తకేసి తిరిగి "నన్నూ పిల్లనీ ఏం కమ్మన్నారు? ఏ గంగలో దూకమన్నారు?" అని అడిగింది.

"ఏమిటి, ఆయన చెప్పేది? నన్ను మాట్లాడవద్దనడానికి నువ్వెవరు? ఇది నా యిల్లు. ఇక్కడంతా నా పెత్తనమే చెల్లుతుంది. మర్యాదగా నడువు బయటికి." లలిత గొంతు పెంచి అంది.

నిస్సహాయతతో కూడిన వుద్రేకంతో వణికిపోయింది విద్యావతి.

"ఏమిటండీ, మాట్లాడరు? మాయమాటలు చెప్పి నన్ను చేసుకున్నారు. పిల్లతల్లిని చేసారు. ఆవిడతో నాకూ సమానస్థానంయిచ్చానన్నారు ఏదీ ఆ సమానత్వం? మీ సరదాలు తీర్చుకోవడంలోనా? ఇహమీదట - నన్నూ నా కూతుర్నీ ఎలా బ్రతకమంటారు?" కళ్ళలో నీళ్ళు కారిపోతుండగా నిలదీసి అడిగింది. అతను నిస్సహాయంగా చూసాడు.

"నా యింటికొచ్చి యీ గొడవేంటి? ఆయన్ని చేసుకోక ముందు ఎలా బ్రతికావు? అలాగే యిహమీదట కూడాను." వెటకారంగా అంది లలిత.

"ఈయన్ని చేసుకోకపోయినా నా మానాన్న నేను బతికేదాన్ని. ఈయన్ని నమ్ముకుని కాస్తోకూస్తో వచ్చే వుద్యోగమూ వదిలేసాను. పైగా యీ పిల్లొకటి నా ప్రాణానికి. నాకేదో దారి చూపించండి. ఆఫీసుకెళ్ళి అడిగితే నా పేర్న ఏమీ రాదన్నారు. మీలాంటిదాన్నే నేనూను." ఏడుస్తూ అంది విద్యావతి. భర్తతో లాభం లేదని అభిమానాన్నిచంపుకుని నేరుగా లలిత తోటే అంది.

ఆమె ఏడుపుకిగానీ, బిక్కమొహం వేసుకున్న చంటిపిల్లని చూసిగానీ లలిత ఏమీ కరగలేదు. అంతగా బండబారిపోయింది.

కడదాకా ముందుండి నడిపిస్తానన్న భర్త దారితప్పి ద్వితీయం చేసుకున్నప్పుడు... ముగ్గురు పిల్లల్తో ఆయింట్లో తన స్థానం పదిలం చేసుకోవడానికి బండబారక ఆమెకి తప్పలేదు. ఇప్పుడేమాత్రం కరగదలుచుకోలేదు.

"నలుగుర్లో మమ్మల్నిపరువుగా బ్రతకనివ్వవా నువ్వు? ఇన్నాళ్ళూ నీ మూలంగా అనుభవించిన నగు బాటు చాలు. నడువిక్కణ్ణుంచీ" విద్యావతితో కఠినంగా అని

"ఒరేయ్, తమ్ముడూ! ఇలారా!" అని లోపలికి కేకేసింది.

విద్యావతి భర్తకేసి దీనంగా చూసింది. అతను నీళ్ళు నిలిచినకళ్ళతో రెండుచేతులూ జోడించి ఆమెని వెళ్ళిపొమ్మన్నట్టు సౌంజ్ఞ చేసాడు.

విద్యావతి హతాశురాలైపోయింది. ఇంకా వుండి లలిత తమ్ముడితో గెంటించుకునే కన్నా తనే వెళ్ళిపోవడం ఉత్తమమనిపించింది. నిశ్శబ్దంగా సంచీనీ పిల్లనీ తీసుకుని నిష్క్రమించింది.

వెంకట్రావు యింట్లోంచీ యివతలికైతే వచ్చిందిగానీ ఎటెళ్ళాలో ఏం చెయ్యాలో తోచడం లేదు విద్యావతికి. తిరిగి తన వూరు వెళ్ళిపోవాలి. అదొక్కటే ప్రస్తుతం తను చెయ్యగలిగే పని. తర్వాత సంగతి తర్వాత.

తిన్నగా బస్‌స్టాండుకెళ్ళి బస్సెక్కింది. చంటిపిల్ల తల్లని ఎవరో లేచి సీటిచ్చారు. కూర్చుంది. ప్రాణం కాస్త తెరిపిన పడింది. కళ్ళ ముందు గడిచినరోజులు

కదుల్తున్నాయి.

తను ప్రైవేటు స్కూల్లో వుద్యోగం చేస్తూండే రోజులు...

ఆ జీతం డబ్బులకి ఆశించి తండ్రి తనకి ముప్పయ్యేళ్ళొచ్చినా పెళ్ళి చెయ్యకపోవడం....

***

"నువ్వతన్తో అలా బయటతిరగడం బాలేదమ్మా! చూసేవాళ్ళు ఏమనుకుంటారు?" ఫస్ట్‌షో సినిమా చూసొస్తున్న కూతుర్తో అంది సుమతి.

విద్యావతి సమాధానం చెప్పలేదు. తల్లికేసి ఓ చూపు చూసి తలొంచుకుని పట్టనట్టు లోపలికెళ్ళిపోయింది. వంటింట్లోకెళ్ళి అన్నం తనే పెట్టుకుని, అక్కడే నవ్వారు మంచం వాల్చుకుని నిద్రపోయింది. నిద్రలో ఎన్నో అందమైన కలలొచ్చాయి. ఆ స్వప్న లోకంలో తన రాకుమారుడితో విహరించింది. సోయగాలొలికించింది. సరాగాలాడింది. ఆకాశమంత పందిట్లో సిగ్గులమొగ్గై మూడు ముళ్ళు వేయించుకుంది. సరిగ్గా అదే క్షణాన ఎవరో తట్టిలేపినట్టు మెలకువ వచ్చింది. ముందుగదిలో తల్లీతండ్రీ మాట్లాడుకుంటున్నారు- తన గురించే.

"విద్య ఏమంటోంది?" తండ్రి అడుగుతున్నాడు.

"ఏమీ చెప్పట్లేదు." తల్లి జవాబు.

"ముప్పయ్యేళ్ళుంటాయా దానికి?"

"ముప్పయ్యేమిటి? ముప్పైరెండు నిండుతాయి. నెహ్రూగారు పోయినేడుకదా, అది పుట్టింది? ఎన్నాళ్ళని పెళ్ళిచెయ్యకుండా వుంటాం?"

"ఏం పెట్టి చెయ్యను? తుమ్మితే వూడిపోయే ముక్కులాంటి వుద్యోగం నాది. కోరికల్నీ సరదాలనీ చంపుకుని జడపదార్థాల్లా బ్రతికేముకాబట్టి యింత తిండితిని మనగలిగేం. ఆడపిల్ల పెళ్ళంటే మాటలా?"

"తప్పుదు కదా మరి. అతనెవరో మీరు తెలుసుకుని ఒకసారి వెళ్ళికలవండి."

"కొండెక్కి కూర్చుంటాడు. పదో పాతికో కట్నం తెమ్మంటాడు."

"మరెలా?"

***

అదో శేషప్రశ్నలా మిగిలింది. తండ్రికి తన పెళ్ళి చెయ్యడం చేతకాదు, యిష్టం లేదు. కలలో తనని వూరించిన స్వర్గాన్ని తనే ప్రయత్నించి అందుకోవాలి - ఇలా నిర్ణయానికొచ్చాక విద్య మళ్ళీ ప్రశాంతంగా నిద్రలోకి జారిపోయింది.

ఆ మర్నాడే వెంకట్రావుని గుళ్ళో పెళ్ళిచేసుకుని యింటి కొచ్చింది. ఇద్దర్నీ యింట్లోకి రానివ్వలేదు విద్యావతి తండ్రి. వీధిలోంచే వెళ్ళగొట్టేసాడు.

గిరుక్కుని వెనక్కి తిరిగొచ్చేసింది.

వెంకట్రావు తనొక్కడూ వుండడానికి తీసుకున్న ఒంటి గదిలోనే వాళ్ళ కొత్తకాపురం మొదలైంది.

అతనెవరో - ఎలాంటివాడో తెలుసుకోవడానికి నిజాయితీగా ప్రయత్నించలేదు విద్యావతి, పెళ్ళికి ముందు. ఏ నిజాలు బయటపడి తనతన్ని చేరుకోవడానికి ఆటంకంగా నిలుస్తాయోనన్న భయంచేత. కొండొకచో ప్రలోభం చేత.

పెళ్ళయ్యాక అన్ని విషయాలు బైటపడ్డాయి. భర్తకి ముందే పెళ్ళైందనీ, ముగ్గురు పిల్లున్నారనీ విని స్థాణువైంది. ఏదైతే జరగకూడదని మనసుని మభ్యపెట్టుకుని అతన్ని చేసుకుందో అదే జరిగింది. అతన్ని నిలదియ్యడానికీ లేదు.

నా కెందుకు చెప్పలేదని అడిగితే

నువ్వడిగావా అంటాడు.

'నా దగ్గిర దాచిపెట్టార'ని అభియోగం వేస్తే-

నువ్వు తెలుసుకోవచ్చుగా అసలా ప్రయత్నమే చెయ్యలేదని ప్రత్యభియోగం వేస్తాడు.

జరిగినదాంట్లో తనదీ తప్పుంది. అతన్నే దోషిని చేసి లాభం లేదు. ముళ్ళకంపమీద చీర పరిచినట్టు అతనిమీద తన జీవితాన్ని పరిచింది. ఏం జరిగినా నష్టం తనకేనని సర్దుకుంది విద్యావతి.

ఎంతకాలం యిలా సాగేదో తెలీదు. అతని భార్యాపిల్లలకి తనొకర్తి వుందని తెలుసో తెలీదో! ఇంతలో అతనికి పెరాలిసిస్ రావడం...



ఇప్పుడు తలుచుకుంటే అదంతా తనెంత వూలిష్‌గా ప్రవర్తించిందో ననిపిస్తుంది గానీ అప్పుడేదో ట్రాన్స్‌లో వున్నట్టు అతని ట్యూన్స్‌కి అనుగుణంగా డేన్స్‌చేసేంది, పెళ్ళి చేసుకోవాలనే ప్రకృతిబద్ధమైన కోరికచేత.

ఇప్పుడు తనేం చెయ్యాలి? ఒకరకంగా భర్త తనని గృహనిర్బంధం చేసాడు. ఉద్యోగం కూడా మాన్పించాడు. ఏమిటి తనకి దారి? ఎటూ అంతుపట్టంలేదు. ఆలోచనల్తో తల పగిలిపోతున్నట్టనిపించింది.

ఇంతలో ఆమె దిగాల్సిన వూరొచ్చింది. బస్సాగింది.

పాపనీ సంచీనీ తీసుకుని దిగింది. ఏదో తెలీని నిస్త్రాణ ఆమెని ఆవరించింది.

ఏం చెయ్యాలి తనిప్పుడు? చేతిలో చిల్లిపైసలేదు. డబ్బంతా ఖర్చైపోయింది. రేపట్నుంచి ఎలా? ఇప్పటికిప్పుడు తనకి వుద్యోగం ఎవరిస్తారు? ఒక్కొక్క అడుగూ ముందుకి కాకుండా వూబిలోకి కూరుకుపోతున్నట్టు భారంగా పడ్తోంది. పిల్ల బరువనిపించి, నడవమని దింపింది.

ఇల్లు చేరేసరికి కనుచీకటైంది. గుమ్మం ముందు కూర్చున్న వ్యక్తిని చూడగానే అడుగుముందుకి పడలేదు. తండ్రి! తన తండ్రి! నాలుగేళ్ళనాడు పెళ్ళిచేసుకుని పసుపుబట్టల్తో వెళ్తే వెళ్ళగొట్టిన తండ్రి! ఇప్పుడెందుకొచ్చినట్టు?

అడుగుముందుకి పడలేదు. అక్కడే ఆగిపోయింది.

"తాళం తియ్యమ్మా!" మెత్తగా అన్నాడాయన. ఆయన మాటలకి నియంత్రించబడినట్టు తాళం తీసింది.

"మనింటికి వెళ్ళిపోదాం. నీ సామాన్లు సర్దుకో. రిక్షా తీసుకొస్తాను." అన్నాడాయన. 'మీ ఆయనకి పక్షవాతం వచ్చిన దగ్గర్నుంచీ ఏం జరిగిందో నేను వూహించగలను. పొద్దున్న నువ్వావూరి బస్సెక్కడం చూసాను. ఎప్పటికో ఒకప్పటికి తిరిగొస్తావని మధ్యాహ్నంనుంచీ యిలాగే కూర్చున్నాను. ఇలాంటప్పుడే మనిషి తప్పు నిర్ణయాలు తీసుకుంటాడు. నీ విషయంలో అలా జరగకూడదనీ..." ఆయన గొంతు బొంగురు పోయింది.

"నాన్నా!" విస్మయంగా అంది విద్యావతి. ఆయన నుంచి అంత ప్రేమని వూహించలేదేమో, అందుకోలేక పోతోంది.

"ప్రతివారూ బొడ్డున మాణిక్యం పెట్టకు పుట్టరు. కానీ అందరికీ ఎంతో కొంత జీవితాన్ని స్తాడు భగవంతుడు. రిజర్వేషన్లనీ, లంచాలనీ, రికమెండేషన్లనీ, కట్నాలనీ ఒకరికేటాయింపులోకి మరొకరు అతిక్రమిస్తూ కొందరిని నందనవనంలోకీ మరికొందర్ని ఎడారిలోకీ మనని మనమే చేర్చుకుంటున్నాం. నువ్వొకలా నేను మరొకలా ఎడారిలోకి చేరుకున్నాం. ఇప్పుడింక నీకు మేము మాకు నువ్వే తోడు. మనకి ఎవరూ చెయ్యం దించరు. పదమ్మా!"

"నాన్నా!"

"ఇంతకన్నా ఏం చెయ్యను విద్యా? డబ్బులేదు. అప్పుచేసి నీ పెళ్ళి చెయ్యగలిగే స్తోమతుకూడా లేదు నాకు. అందుకే నీ పెళ్ళి చెయ్యలేకపోయాను. నీకు నువ్వుగా చేసుకుని గుమ్మంలోకి వస్తేకూడా రానివ్వలేదు. ఎందుకంటే... కొత్తల్లుడు కూడా నాకు తలకి మించిన భారమేనమ్మా! మీ బ్రతుకేదో మీరు బ్రతుకుతారను కున్నాను. అన్యాయం చేస్తాడనుకోలేదు."

తండ్రేమిటో అర్థమైంది విద్యావతికి.

ఒకప్పుడు పెళ్ళికాలేదన్న అలజడి వుండేది తనలో. ఆ అలజడిలో అందరిదీ తప్పుగానే అనిపించేది. తండ్రి అసమర్థతకి బాధనిపించేది. ఇప్పుడు - అంటే వెంకట్రావు రెండోభార్యగా ఓటమి చవిచూసాక తండ్రేమిటో... ఆయన్ని ఆవరించుకున్న చీకట్లేమిటో.. ఆచీకట్లోనే తన గమ్యం ఎలా వెతుక్కోవాలో అర్థమైంది. చీకట్లోనే పుట్టి, చీకట్లోనే పెరిగిన తనని కొద్దిపాటి వెలుగుతర్వాతి యీ చీకటి యింతగా బాధిస్తోందెందుకో మాత్రం అర్థమవలేదు. ❐